బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే నెరవేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం అల్వాల్ మండల తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42శాతం స్థానిక సంస్థల్లో పెంచాలని, బీసీ నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. ప్రతి మండలంలో బీసీ గురుకులాలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్, మల్లిఖార్జున్‌గౌడ్, మల్లిఖార్జున్‌యాదవ్, జశ్వంత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాప్రా: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తి కావస్తున్నా.. బీసీ డిక్లరేషన్ హామీ అమలు కావడంలేదన్నారు. బీజేపీ బీసీ మోర్చా పిలుపు మేరకు కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీసీ మోర్చా నాయకులు వినతిపత్రం అందజేశారు. మంగేష్, వినోద్, రమేష్‌యాదవ్, నాదం, మర్రి మోహన్ రెడ్డి, బ్రహ్మచారి, రాజ్ పురోహిత్, కృష్ణారెడ్డి, వెంకులు, లక్ష్మణ్‌గౌడ్, శాంతికిరణ్, సురేష్, ధర్మాకర్, మహేందర్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, రాంబాబు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

ఎంఎస్‌ఐ డైరెక్టర్ వర్గీస్ టేక్‌నాథ్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని మౌంట్ ఫోర్టు సోషల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టేక్‌నాథ్ అన్నారు. కనీస వేతన చట్టాన్ని వర్తింపజేసి రూ.12 వేల వేతనం అందేలా ప్రభుత్వం దృష్టి సారించాలనారు. సోమవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా రామంతాపూర్ మౌంట్ ఫోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గృహ కార్మికులు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహ కార్మికుల హక్కులను గుర్తించి పరిరక్షించడంతో పాటు హింసవివక్షకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు రాష్ట్రంలో కొత్త చట్టం తీసుకురావాలన్నారు. వారానికోసారి సెలవు, ఉద్యోగ భద్రత ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర కో– ఆర్డినేటర్ సిస్టర్ గృహ కార్మికులకు ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ గృహాలు కేటాయించాలన్నారు. సంఘం సెక్రటరీలు, సిస్టర్ నిర్మల శోభ, జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, మాధురి, స్వర్ణ, పవన్, గృహ కార్మికులు పాల్గొన్నారు.

సత్కారం



డా.యాకేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

అల్వాల్: అల్వాల్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ యాకేందర్‌రెడ్డి నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికి అనంతరం సత్కరించారు. డాక్టర్లు శైలజ, అనగ్, సారిక, సిబ్బంది వీరయ్య, జగన్ పాల్గొన్నారు.

ఏఎంహెచ్‌ఓకు అదనపు బాధ్యతలు

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్ వైజర్ అదనపు బాధ్యతలు ఏఎంహెచ్‌ఓకు అప్పగించారు. సర్కిల్‌లో మూడున్నరేళ్ల పాటు శానిటరీ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహించిన నాగరాజు బదిలీ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ బాధ్యతలు కాప్రా ఏఎంహెచ్‌ఓ చూస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీకి వచ్చిన నాగరాజు, తిరిగి వైద్య ఆరోగ్యశాఖకు బదిలీ అయ్యారు. వనస్థలిపురంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా నాగరాజు నియమితులయ్యారు.

పారిశ్రామిక రంగంలో యువతకు ప్రోత్సాహం



ఎన్‌ఎస్‌ఐసీలో అవగాహన కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

కాప్రా: పారిశ్రామికరంగంలో ఎస్సీ, ఎస్టీ యువతకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ హైదరాబాద్ సెంటర్ హెడ్ సురేష్ తెలిపారు. సోమవారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని ఎన్‌ఎస్‌ఐసీలో ఎస్సీ, ఎస్టీ, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. పారిశ్రామికరంగంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రామగణేష్‌నాయుడు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ స్టార్టప్ ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ వెంకట్ తదితరులు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ యువత ఉద్యోగాల కోసం కాకుండా పట్టుదలతో పారిశ్రామిక రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. కృషి, పట్టుదలతో ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. ఔత్సాహికులకు తమ సంస్థ అండగా ఉండి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు.

అభివృద్ధి పనులపై కార్యాచరణ చేపడతాం



కార్పొరేటర్‌తో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

కుషాయిగూడ: అభివృద్ధి, పెండింగ్ పనులపై కార్యాచరణ చేపడతామని, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ జె.ప్రభుదాస్ అభ్యర్థన మేరకు సోమవారం ఆయన డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి, పెండింగ్ పనులను కార్పొరేటర్ జెడ్‌సీకి వివరించారు. బండబావి వద్ద చేపట్టనున్న మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, రాజీవ్‌పార్కులో చెడిపోయిన జిమ్ పరికరాలు, పార్కు నిర్వహణ వ్యయం వంటి అంశాలను ఆయనకు వివరించారు. శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీహాల్‌ను తొలగించి కొత్తగా నిర్మించాలని కోరారు. అంతర్గత రోడ్లు, సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సిన వివరాలు జెడ్‌సీకి అందజేశారు. దీనికి జెడ్‌సీ సానుకూలంగా స్పందించి డివిజన్ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. కాప్రా సర్కిల్ డీసీ ముకుంద్‌రెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్, డీఈ రూప, వార్డు ఆఫీసర్ షహనావాజ్, ఏఈ స్రవంతి స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలి

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి డిమాండ్

అల్వాల్: దివ్యాంగులను కించపర్చేలా సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యలు చేసిన ఆమె క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షుడు ఎస్.వినయ్ మాట్లాడుతూ.. 'దివ్యాంగులకు సివిల్స్‌లో రిజర్వేషన్లు అవసరమా..! అని, ఈ ఉద్యోగానికి ఫీల్డ్‌కు వెళ్లాల్సి ఉంటుందని' దివ్యాంగులను కించపర్చేలా సోషల్ మీడియా ట్విట్టర్ ద్వారా స్మితా సబర్వాల్ పోస్ట్ చేయడం దివ్యాంగులను అవమానిస్తున్నట్లుగా ఉందన్నారు. వెంటనే ఆమె ఆ పోస్టును తొలగించాలని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సురేష్‌కుమార్, షబానా, సాయికుమార్, విశ్వరూపచారి, రాము, మధుసూదన్, అశోక్ కుమార్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



అల్వాల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపడుతున్న దృశ్యం

నేరాలకు అడ్డాగా భగాయత్ !

ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్న వైనం

లే అవుట్ పేరు చెబితేనే ఉలిక్కిపడుతున్న ప్రజలు

విశాలమైన రోడ్లు, పచ్చని చెట్లతో చూపరులకు ఆకట్టుకునే భగాయత్ లేఅవుట్ నేడు ఆపేరు చెబితేనే స్థానికులు ఉలిక్కి పడుతున్నారు. ఆకతాయిల చేష్టలతో అటువైపు వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వరుస దాడులతో ప్రస్తుతం కేరాఫ్‌గా మారోతుంది.



ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఉప్పల్ భగాయత్ లే అవుట్ శాలమైన రోడ్లు, అత్యాధునిక అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్, విశాలమైన పార్కులతో అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ప్రాంతంగా చెప్పవచ్చు.

- ఓ పక్క మినీశిల్పారామం, మరోపక్క మెట్రో రైల్వేస్టేషన్ అన్ని రకాల రవాణ సౌకర్యం, మాల్స్, సినిమా థియేటర్స్, పార్కులు, ఉప్పల్ రింగు రోడ్డు, స్కైవాక్ వంతెన, మరో పక్క అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఉన్న ఉప్పల్ భగాయత్ ప్రస్తుతం ఆ పేరు చెబితేనే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 6 గంటలైతే సొంతింటికి రావాలంటే ప్రజలు జంకుతున్నారు.

ఎందుకీ పరిస్థితి.. ?

ఉప్పల్ భగాయత్‌లో వరుస నేరాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. సరైన సెక్యూరిటీ లేకపోవడంతో నేరగాళ్లు సులభంగా తప్పించుకునేందుకు నలుమూలల నుంచి దారులు, జాతీయ రహదారులకు అనుసంధానంతో నేరగాళ్లకు ధీమా పెరుగుతోంది.

- గంజాయి, హత్యలు, హత్యాయత్నాలు, పోకిరీల ఆగడాలు, బైక్ స్టంట్స్, రాత్రైతే గుంపులుగుంపులుగా అల్లరి మూకలు సంచరిస్తూ.. ప్రశ్నిస్తే దాడులకు తెగ బడుతున్నారు.
- ప్రేమ జంటలపై దాడులు ఇలా చెప్పుకుంటూ పోతే.. జరగని నేరమంటూ.. లేకుండా ఉప్పల్ భగాయత్‌లో నేరాలు పెరుగుతూనే ఉన్నాయి.
- రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళను దారుణంగా కారుతో ఢీకొట్టించి హతమార్చారు. ఒక్కోసారి కళేబరాలు, అస్థిపంజరాలు బయటపడిన సంఘటనలు కోకొల్లలు. ఈ మధ్యకాలంలో ప్రేమ జంటను బెదిరించి బ్లాక్ మేయిల్ చేసిన విషయంలో ఏకంగా సెక్టార్ ఎస్సైపై వేటు పడిన విషయం విధితమే.

కోట్లు కుమ్మరించి ఇళ్లు కట్టుకున్నాం..



కోట్లాది రూపాయలతో ఇళ్లు నిర్మించుకున్నాం. మా ఇంటికి మేము రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సరైన సెక్యూరిటీ లేక 100కు ఫోన్‌చేస్తే పోలీసులు వచ్చే లోగా నేరస్తులు దాడిచేసి పారిపోతున్నారు. దిక్కు దివానా లేకుండా పోయింది.

– బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, స్థానికుడు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..



నగరంలోనే అతిపెద్ద లే అవుట్ ఉప్పల్ భగాయత్. అలాంటి లే అవుట్ ప్రతిష్టకు భంగం కలిగేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇక్కడి సమస్యలపై రోజూ పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే కొంతమేర నేరాలను అదుపు చేయవచ్చు. జీహెచ్‌ఎంసీ పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తీసుకుని మౌలిక వసతులు కల్పించాలి. పార్కు కోసం కేటాయించిన 8 ఎకరాల స్థలంలో థీమ్ పార్కును ఏర్పాటు చేయాలి.

– మధుసూదన్‌రెడ్డి, ఓనర్స్ అసోసియేషన్ కన్వీనర్

విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదు..



ప్రతిరోజు సాయంత్రం వాహనాలను తనిఖీలు చేస్తూ.. పెట్రోలింగ్‌ను పెంచాం. రాత్రి 10 దాటితే బయటి వ్యక్తులు లోపలికి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ అధికారులకు నోటీసులు జారీ చేశాం. సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదు.

– ఎలక్షన్‌రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్‌కి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించండి



బోడుప్పల్: 20వ డివిజన్ పరిధి రాఘవేంద్ర కాలనీ వద్ద నాలాపై మ్యాన్‌హోల్ ప్రమాదకంగా ఉంది. 20 రోజుల క్రితం భారీ వాహనం మ్యాన్‌హోల్‌పై నుంచి వెళ్లడంతో కొంత భాగం పగిలిపోయి ధ్వంసమైంది. గమనించిన స్థానికులు నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సిబ్బంది వచ్చి ప్రమాద సూచికగా ఒక చెక్కను ఏర్పాటు చేశారు. వర్షం, మురుగు వెళ్లే ఈ నాలా 15 అడుగుల లోతులో ఉందని, గత 5 రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొత్త మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని బాలుడిని పోలీసులకు అప్పగింత



కుషాయిగూడ: తప్పినపోయిన ఓ బాలుడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. వాసవిశివనగర్ సమీపంలో 8ఏళ్ల గుర్తుతెలియని బాలుడిని గుర్తించిన స్థానికులు కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా.. బాలుడి మానసిక స్థితి సరిగ్గా లేదని పోలీసులు తెలిపారు దీంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

'ప్రజావాణి'తో సత్వర పరిష్కారం



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొత్తం 11 ఫిర్యాదులు రాగా.. ఇంజినీరింగ్ విభాగానికి 6 ఫిర్యాదులు, టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 4, రెవెన్యూ విభాగం 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్వాల్: బోనాల పండుగ నేపథ్యంలో అల్వాల్ డివిజన్ పరిధిలోని దేవాలయాల వద్ద రోడ్డు ప్యాచ్‌వర్క్స్ చేపట్టాలని సోమవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అల్వాల్ సర్కిల్ ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్‌నగర్‌లో మంజూరైన సీసీరోడ్డు పనులు ఆలస్యమవుతున్నాయని వెంటనే ప్రారంభించాలని కోరారు.

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మున్సిపల్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 11 దరఖాస్తులు అందాయని, ప్రజావాణిలో వచ్చే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడమే ధ్యేయంగా తాము పనిచేస్తామన్నారు. డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, ఏఈ బిక్షపతి, టీపీఓ అలీపాషా తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: నార్త్ అల్వాల్ సొసైటీ అసోసియేషన్ (నాసా) 20 కాలనీల ఆధ్వర్యంలో ప్రజావాణిలో అల్వాల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పెండింగ్ కనెక్టివిటీ రోడ్లు, పార్కులకు ఫెన్సింగ్, మౌలిక వసతులపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎంటీ కాలనీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కిషన్, రాజిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సమ్మిరెడ్డి, ఫాతిమారెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ లైన్ నెంబర్–30లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రోడ్లు, కమ్యూనిటీహాల్ మరమ్మతులు, వీధి లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్ తదితర సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సాయి, సురేష్, శ్రీకాంత్‌యాదవ్, గోపాల్, శివ, మహేష్, కాలనీవాసులు సాయికిరణ్, ఉమేష్, నర్సమ్మ, బాలామణి, జంజీర్ పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాలపై స్పెషల్ డ్రైవ్



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

కాప్రా: ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపార సముదాయాల పెండింగ్ బకాయిలపై కాప్రా మున్సిపల్ సర్కిల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఏఎల్‌ఓ, జవాన్ సభ్యులుగా ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని వ్యాపార సముదాయాలను తనిఖీ చేశారు. ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని ఓ మల్టిప్లెక్స్ రూ. 13 లక్షలు బకాయిలు చెల్లించకపోవడంతో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ టీమ్ పరిశీలించింది. పెండింగ్ బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. కాప్రా సర్కిల్‌లో ప్రస్తుతం 1200 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయని, పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించామని ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. బకాయిలు చెల్లించాలని అధికారులు సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మల్లాపూర్ బ్రహ్మపురికాలనీ, నాగలక్ష్మి నగర్, మల్లాపూర్ ఐడీఏ ప్రధాన రహదారిలో రూ.42 లక్షలతో జరుగుతున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మల్లాపూర్ నుంచి బోడుప్పల్‌కు నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, సకాలంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. జలమండలి మేనేజర్ వేణుగోపాల్, దినేష్, బీఆర్‌ఎస్ నేతలు పీఆర్. ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రఘు తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

కాప్రా: డివిజన్ సమస్యలపై కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిశారు. కాప్రా డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లు, పార్కులు, కమిటీ హాల్స్‌కు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయా పనులకు దాదాపు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారన్నారు.

'ఎంపవర్‌హర్ మహిళా మేళా'



పేద విద్యార్థులకు చెక్కు పంపిణీ చేస్తూ..

అల్వాల్: సైనిక్‌పురిలోని ఎంకే.రావు మెమోరియల్ హాల్‌లో పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఎంపవర్‌హర్ మహిళా మేళా' నిర్వహించారు. సుమారు 50 మంది స్వయం ఉపాధి మహిళా వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించగా.. భారీ సంఖ్యలో సందర్శకులు హాజరై పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అనంతరం పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 21 మంది పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది బదిలీలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోట వెంకటేశ్వర్లు పోచారం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ చేతుల మీదుగా బదిలీపత్రాలను అందుకున్నారు. నేడు పోచారంలో బాధ్యతలు స్వీకరిస్తారు. కోట వెంకటేశ్వర్లు స్థానంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవికుమార్ బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

కరెంట్ పోల్‌ను బైకు ఢీకొని వ్యక్తి మృతి

మేడిపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. ప్రమాదవశాత్తు కరెంటుపోల్‌ను బైకు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ బుద్ధానగర్‌కు చెందిన ఎస్. అజయ్‌కుమార్ (26)నగరంలోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం తన ద్విచక్రవాహనంపై స్నేహితుడు నిఖిలేష్‌తో కాచవాని సింగారం గ్రామానికి వెళ్లి రాత్రి సుమారు 2 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా.. దివ్యానగర్ కాలనీ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కరెంట్ పోల్‌కు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్‌కుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నిఖిలేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కత్తితో దాడి.. కేసు నమోదు

మేడిపల్లి: మహిళపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం చెంగిచర్ల మేకల మండి మాంసం విక్రయించే డబ్బాల పక్కన నివాసం ఉంటున్న కల్యాణికి, పక్కింటి సునితకు మధ్య ప్లాస్టిక్ కవర్ విషయంలో వాగ్వాదం జరిగి ఒకరితో ఒకరు తోపులాట జరుగుతుండగా.. అక్కడే ఉన్న గౌస్ కల్యాణిపై కత్తితో దాడికి పాల్పడాడు. ఈ ఘటనలో కల్యాణి మెడవద్ద గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య..

ఉప్పల్: వ్యక్తి గత కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ అరవింద్ నగర్ ప్రాంతానికి చెందిన సందమల్ల నాగేష్ చిన్న కుమారుడు భానుప్రకాశ్(30) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరో వ్యక్తి..



ప్రశాంత్ (ఫైల్)

మేడిపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ గాయిత్రిహిల్స్‌కి చెందిన బన్నాల ప్రశాంత్(27)పెయింటర్. కాగా కొన్ని రోజులుగా తన ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఆదివారం రాత్రి 11గంటల సమయంలో భార్య గొడవపడి బాల్కానీలో పడుకుంది. ఉదయం 6.30 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి చూడగా.. ప్రశాంత్ ఉరేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.